RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 271 పేజీలు - 08 బుధవారం 26 ఆగస్టు 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక



## త్వరత్వరగా మూసీ భూసేకరణ

- న్యాయపరమైన చిక్కులు లేకుండా నిర్వహణ
- అధికారుకు సిఎం రేవంత్ ఆదేశం

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగష్టు25:** మూసీ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణను వేగవంతం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ల్యాండ్ పూలింగ్‌పైన స్పష్టమైన విధానం రూపొందించు కోవాలన్నారు. మూసీ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల

మిగతా2లో...

## శాసన వ్యవస్థలో కమిటీలకు ఎంతో ప్రాధాన్యత

● సూచనలు, సలహాల్లో కమిటీలదే కీలక భూమిక ● పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలి ● శాసనమండలి కమిటీల సమావేశంలో గుత్తా, గడ్డం, ప్రసాద్‌ల సూచన




**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగష్టు25:** శాసన వ్యవస్థలో కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. ప్రజల సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి అవసరమైన సూచనలు, సిఫారసులు చేయడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో షెడ్యూల్ తెగల వారికి సబ్సిడీ పథకాలు అమలు కాక లబ్దిదారులు నేటికీ సబ్సిడీ పేపర్లను పట్టుకొని తిరుగుతున్నారు. అలాంటి

మిగతా2లో...



## ఏడాదిలో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యం

- స్పష్టమైన కార్యాచరణతో పనులు వేగవంతం చేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగష్టు25:** దేవాదుల ప్రాజెక్టును ఏడాదిలోగా వందశాతం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం నాడు జలసౌధలో దేవాదుల ప్రాజెక్టు పై జరిగిన

మిగతా2లో...

## తెలుగు రాష్ట్రాల మధ్య రహదారి అభివృద్ధి

రూ.840.41 కోట్లతో విస్తరణకు కేంద్రం ఆమోదం

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి




## వనమహోత్సవ లక్ష్యాన్ని చేరుకోవాలి

- నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవాలి
- ప్రతి ఒక్కరికి పని కల్పంచి ఆదుకోవాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క




## సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టండి

● వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి ● ఎల్‌నినో ప్రభావంతో పంటల మార్పిడి జరగాలి ● నీట్ పరీక్ష పక్కాగా జరిగేలా చర్యలు ● కలెక్టర్లకకు సిఎస్ సంజయ్ జాజు దిశానిర్దేశం




## విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు

- ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి
- సిఎం రేవంత్‌కు బాధ్యతారాహిత్యం కూడదు
- బిజెపి సభలో ఎంపి ఈటలె రాజేందర్ విమర్శలు
- స్వల్పంగా దెబ్బతిన్న రామచంద్ర రావు ఆరోగ్యం



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగష్టు25:** 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అంటే అర్థం ఏంటో తెలుసా అని ప్రశ్నించారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గురించి ఆలోచించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిదేనని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. 'ఫీజు బకాయి – భాజపా లడాయి' పేరుతో

మిగతా2లో...

## సిఎం రేవంత్ యూఎస్ పర్యటనపై వివరణ ఇవ్వాలి

- ఎందుకు అమెరికా పర్యటనో వివరంగా చెప్పాలి
- మేయర్ మమ్దానీని ఎందుకు కలవాలనుకున్నారో చెప్పాలి
- నిబంధనల మేరకే కేంద్ర విదేశాంగశాఖ నిర్ణయాలు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టీకరణ




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఆగష్టు25:** అమెరికా పర్యటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ కారణాలతోనే తన యూఎస్ పర్యటనను కేంద్రం అడ్డుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కిషన్ రెడ్డి తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో మం గళవారం ఢిల్లీలో ఆయన స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం అని కొట్టిపారేశారు.

మిగతా2లో...



## 22ఎ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ

- పొంగులేటిని వెంటనే బర్తర్ఫ్ చేయాలి
- అసెంబ్లీలో ఈ అంశంపై సర్కార్‌ను నిలదీస్తాం
- బిఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగష్టు25:** మొత్తం 22ఎ నిషేధిత భూముల అక్రమాలపై తక్షణమే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అసలు ఈ భూములను ఎవరు నిషేధిత జాబితాలో పెట్టమన్నారో నిజాలు బయటపడాలని బిఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలని, నిషేధిత జాబితాను వెబ్‌సైట్‌లో

మిగతా2లో...

## వారిపై చర్యలు ఉంటాయి: మల్లు రవి



**తొలి అక్షరం/హైదరాబాద్ ఆగష్టు25 :** మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పూర్తి అంశాలతో నివేదికను పొందు పరిచి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌కు అందజేశామని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి స్పష్టం చేశారు. దీనిని పార్టీ రాష్ట్ర వ్యవహారాల

మిగతా2లో...

# శాసన వ్యవస్థలో కమిటీలకు ఎంతో ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత కమిటీ ఛైర్మన్ మరియు సభ్యులపైన ఉన్నదన్నారు. గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కమిటీలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కార మార్గాలను సూచించాలి. కమిటీల సభ్యులు ప్రజల నుంచి వచ్చే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... లెజిస్లేటివ్ కమిటీలు ప్రభుత్వం మరియు ప్రజల మధ్య ఒక ముఖ్యమైన వారధిగా పని చేయాలన్నారు. తద్వారా పథకాల అమలులో ప్రభుత్వం మెరుగైన ఫలితాలు సాదించేందుకు మరియు ప్రజలకు పథకాలు మరింతగా చేరువయ్యేందుకు ఉపయోగపడుతుంది. తెలంగాణ రాష్ట్ర జనాభాలో 10.45 శాతం మంది ఉన్న షెడ్యూల్డ్ తెగల జీవన పరిస్థితులను అధ్యయనం చేయడం, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరును సమీక్షించడం, లోటుపాట్లను గుర్తించడం, వారి సమగ్ర అభివృద్ధికి అవసరమైన సూచనలను ప్రభుత్వానికి అందించడం ఈ షెడ్యూల్ తెగల సంక్షేమ కమిటీ ప్రధాన కర్తవ్యం అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం మరియు సమ్మిళిత అభివృద్ధి అనే ఆదర్శాల పట్ల మనందరి సమిష్టి నిబద్ధతకు వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటి ప్రతీక. కమిటీలు ప్రజల అవసరాలను అర్థం చేసుకుని, అర్థవంతమైన సిఫార్సుల ద్వారా వారి జీవన నాణ్యతను మెరుగుపరచడానికి దోహదపడాలి.

మహిళల భద్రత మరియు ఆర్థిక సాధికారతకు సంబంధించిన పథకాలు, శిశు సంక్షేమ సంస్థలు మరియు అంగన్వాడీల పనితీరు, దివ్యాంగులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అలాగే వయోవృద్ధులకు అందుబాటులో ఉన్న జీవన పరిస్థితులు మరియు ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై కమిటీ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శాసన వ్యవహారాల శాఖా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... శాసనమండలి సంయుక్త కమిటీలు అత్యంత ప్రభావితమైనవి. బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ సంయుక్త కమిటీ సూచనలు, సలహాలు ఉపయోగపడుతాయి. క్షేత్ర స్థాయిలోని సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలతో ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం ద్వారా పరిష్కరించవచ్చు. జనాభాలో సగభాగంగా ఉన్న మహిళల సాధికారత కోసం ఈ కమిటీ ఇచ్చే సలహాలు, సూచనలు ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమైనవి. అదేవిధంగా శిశువులు, దివ్యాంగులు, వృద్ధుల రక్షణ, సంరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై కూడా కమిటీ రిపోర్టులు ఎంతో విలువైనవన్నారు. శాసన పరిషత్ సమావేశ మందిరంలో ఈరోజు జరిగిన శాసనమండలి (లెజిస్లేచర్) షెడ్యుల్ తెగల సంక్షేమ కమిటీ, వెనుకబడిన వర్గాల సంక్షేమ కమిటీ మరియు మహిళా, శిశు, వృద్ధుల సంక్షేమ కమిటీల ప్రారంభ సమావేశానికి శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ హాజాచరయ్యారు. వెల్ఫేర్ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు, సభ్యులు డాక్టర్ మురళీ నాయక్, రాందాస్ మాలోతు, కోవా లక్ష్మి, అనీల్ జాదవ్, తెల్లం వెంకట్రావు, శ్రీపాల్ రెడ్డి పింగళి బిసి వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, సభ్యులు ఆర్. భూపతి రెడ్డి, చింతా ప్రభాకర్, శ్రీ గణెళిష్, రామారావు పవార్, యల్ రమణ, తీన్మార్ మల్లన్న.లు హాజరయ్యారు. మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల వెల్ఫేర్ కమిటీ చైర్మన్ చిట్టెం పర్ణికా రెడ్డి, సభ్యులు మట్టా రాగమయి, కోవా లక్ష్మి, వాణీ దేవి. శాసన పరిషత్ కార్యదర్శి డా. వి నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతిలు కూడా హాజరయ్యారు. ముందుగా నూతన కమిటీ చైర్మన్లకు, సభ్యులకు పుష్ప గుచ్ఛాలతో అభినందనలు తెలిపిన చైర్మన్, స్పీకర్ గార్లు మరియు సెక్రటరీలు సమావేశాన్ని ప్రారంభించారు.

# 22ఎ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ఎందుకు బ్లాక్ చేశారో సమాధానం చెప్పాలని అన్నారు. ప్రజల భూములతో చెలగాటమాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ముఖ్యమంత్రి తక్షణమే బర్తరఫ్ చేయాలని కోరారు. బాధితుల పక్షాన నిలబడి సెప్టెంబర్ 7న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తామని, సభను స్తంభింపజేసి అయినా బాధితులకు న్యాయం జరిగేలా పోరాడతామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన తమ్ముడికి మాత్రం వందల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కట్టబెడతారని, సామాన్య ప్రజల ఆస్తులను మాత్రం 22ఎలో పెట్టి ఇబ్బందుల పాలు చేస్తారని హరీశ్ రావు విమర్శించారు. చివరికి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్, సీఎం ఇల్లు కూడా 22ఎ నిషేధిత జాబితాలోనే ఉన్నాయంటే ఈ ప్రభుత్వ పనితీరు ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు.

రాష్ట్రంలో ఎక్కడ ప్రభుత్వ భూములున్నా హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, హౌసింగ్ బోర్డు భూములతో పాటు పిల్లలు ఆడుకునే వెయ్యి గజాల పార్కును కూడా రేవంత్ రెడ్డి అమ్మకానికి పెట్టారని, ఇలా అమ్ముకుంటూ పోతే రేపు బడికి, గుడికి, చివరకు స్మశాన వాటికకు కూడా భూమి మిగలదని ధ్వజమెత్తారు. కమీషన్ల కక్కుర్తి కోసమే సామాన్య ప్రజల ఆస్తులను ప్రభుత్వం నిషేధిత జాబితాలోకి నెట్టిందని బీఆర్ఎస్ డిప్యూటీ ఎలోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ ఎం.జే. గార్డెన్స్‌లో 22ఎ భూముల సమస్యలతో సతమతమవుతున్న బాధిత కుటుంబాల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, గోరేటి వెంకన్న తదితరులతో కలిసి బాధితుల ఆవేదనను స్వయంగా అడిగి తెలుసుకున్న హరీశ్ రావు, బీఆర్ఎస్ పార్టీ పక్షాన వారికి పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై పదునైన విమర్శలు గుప్పించారు. 22ం కుట్ర వెనుక భారీ కమీషన్ల బాగోతం దాగి ఉందన్న ఆయన, ఈ అక్రమాల్లో ఏ-1గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏ-2గా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. 50-50 కమీషన్ల కోసమే లక్షలాది మంది ప్రజలను నిద్రలేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. 98 శాతం భూములను 22ం జాబితా నుంచి తొలగించామని మంత్రి పొంగులేటి పచ్చి అబద్దాలు ఆడుతున్నారని, అదే నిజమైతే వందలాది మంది బాధితులు తమ గోడు వెళ్లబోసుకోవడానికి ఇక్కడికి ఎందుకు వస్తారని ప్రశ్నించారు.

# సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టండి

తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు25: సీజనల్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలనిఅధికారులకు సీఎస్ సంజయ్ జాజు సూచించారు. వర్షాలు, వరదలు నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ పరిస్థితులు, ప్రజలకు అవసరమైన సేవలు, నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఏర్పాటు తదితర అంశాలపై కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఆయా అంశాలపై చేపడుతున్న చర్యలను కలెక్టర్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇక నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహణకు సంబంధించి జిల్లాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీఎస్ ప్రత్యేకంగా సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక వసతులు, భద్రత, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా తదితరత అంశాలపై అధికారులతో సమన్వయం చేసుకుని పని చేయాలని సూచించారు. ఈ ప్రవేశపరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో పంట మార్పిడి విధానాలపై రైతులను మరింత చైతన్యపరిచి వ్యవసాయసాగుకు అనుసరించాల్సిన నూతన విధానాలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల వారీగా సీజనల్ పరిస్థితులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలపై సీఎస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. పంటల వైవిధ్యీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్) అవసరాన్ని చెబుతూ, తక్కువ నీటి అవసరం ఉండే, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటలను సాగు చేసేలా రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు.

# విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

భాజపా చేపట్టిన కార్యక్రమంలో ఈటల పాల్గొని మాట్లాడారు. సీఎం ఒకసారి రాష్ట్రంలోని విద్యార్థుల పరిస్థితి గురించి ఆలోచించాలన్నారు. 20లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడే బాధ్యతను భాజపా తీసుకుందని పేర్కొన్నారు. 'నా విద్యార్థులు, నా యువత క్వాలిటీగా ఉండాలి.. ఆరోగ్యవంతులుగా ఉండాలి' అని కలలు కంటున్న నాయకుడు నరేంద్ర మోదీ అని వివరించారు.

పేద తల్లిదండ్రుల పిల్లలు కూడా గొప్పగా చదువుకొని డాక్టర్లు, ఇంజనీర్లు, అడ్వకేట్లు, ఉన్నతాధికారులు కావాలని కలలు కంటున్నారని, అదే నిజమైన తెలంగాణ అభివృద్ధిగా పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం రామచందర్ రావు చేస్తున్న ఈ 48 గంటల దీక్షకు బీజేపీ అండగా ఉందన్నారు.

ఫీజుల బకాయిలు చెల్లించే వరకు.. తెలంగాణ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు భాజపా పోరాటం కొనసాగుతుందని తెలిపారు. నిరాహార దీక్ష చేస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అస్వస్థతకు గురయ్యారు. రామచందర్ రావును పరీక్షించిన వైద్యులు.. బీపీ 90/60గా ఉన్నట్లు తెలిపారు.'ఫీజు బకాయి-భాజపా లడాయి' పేరుతో భాజపా నేతలు రెండో రోజు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. రామచందర్ రావు దీక్షకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకట రమణారెడ్డి, పాయల్ శంకర్, రామారావు పటేల్ పలువురు భాజపా నేతలు మద్దతు తెలిపారు.

# సీఎం రేవంత్ యూఎస్ పర్యటనపై వివరణ ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

అనుమతులు లేకుండా ఎందుకు విదేశీ పర్యటనకు వెళ్లారంటూ తెలంగాణ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి.. స్థాయికి తగినట్లుగా ఈ పర్యటన లేదని తెలిపారు.ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనపై తాము కొత్తగా నిబంధనలు పెట్టలేదని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం నుంచి ఉన్న నిబంధనలే తాము అమలు చేశామని స్పష్టం చేశారు.

ఇది సాధారణ పక్రియ.. ఇందులో రాజకీయాలకు తావు లేదన్నారు. భారత్‌పై విషం చిమ్మే వ్యక్తి న్యూయార్క్ మేయర్ మామ్దానీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారంటూ వార్తలు వచ్చాయని వివరించారు. ప్రధాని మోదీని టెర్రరిస్ట్ అని న్యూయార్క్ మేయర్ వ్యాఖ్యనించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

మామ్దానీను ఎందుకు కలుస్తున్నారో.. సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గతంలో తన విదేశీ పర్యటనను కూడా కేంద్ర విదేశాంగ శాఖ నిరాకరించిందని కిషన్ రెడ్డి తెలిపారు. మన దేశ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని విదేశాంగ శాఖ ఈ నిర్ణయం తీసుకుందని అభిప్రాయపడ్డారు.

గుజరాత్ సీఎంకు యూఎస్ పర్యటనకు అనుమతి ఇచ్చి.. తమకు అనుమతి ఇవ్వలేదని సీఎం రేవంత్ వాదించడం వితండవాదమని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ సీఎంగా ఉన్నప్పుడు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన విదేశీ పర్యటనను నిరాకరించిందని చెప్పారు. అయితే సీఎం రేవంత్ రెడ్డికి హార్వర్డ్ బిజినెస్ కోర్సు చదివేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలను కూడా గతంలో రద్దు చేసిందని చెప్పారు.

కుల గణన అంశంలో తెలంగాణ ప్రభుత్వం ఫెయిల్యూర్ అయిందని తెలిపారు. హైదరాబాద్‌లో 20 శాతం ఇళ్లలో కులగణన జరగలేదని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి కుల గణనపై అవగాహన లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు.

# తెలుగు రాష్ట్రాల మధ్య రహదారి అభివృద్ధి

తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఆగస్టు25: తెలుగు రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి 365బీబీ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బుట్టాయగూడెం-ఎల్ఎన్డీ పేట, పట్టిసీమ-కొవ్వూరు సెక్షన్ల మధ్య 45.09 కిలోమీటర్లతో రహదారి ఉన్నతీకరణ కోసం రూ.840.41 కోట్లతో కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర రోడ్లు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 45 కిలోమీటర్ల 2 లేన్ల జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్లు నిర్మించనున్నట్లు గడ్కర్ తెలిపారు. ఈ రహదారి ఉన్నతీకరణతో పోలవరం ప్రాజెక్ట్, పరిసర గ్రామాలకు కనెక్టివిటీ పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతం పొగాకు, చెరకు, ఫామాయిల్ తోటలతో నిండి ఉంటుందని.. ఈ హైవే అభివృద్ధితో మౌలిక సదుపాయాలు మెరుగు అవుతాయన్నారు. పంటల రవాణా వేగంగా, సురక్షితంగా జరుగుతుందని చెప్పారు. పంట పొలాల నుంచి మార్కెట్‌కు అనుసంధానం పెరుగుతుందని, స్థానికంగా జీవనోపాధి మెరుగవుతుందని గడ్కరీ పేర్కొన్నారు. అప్‌గ్రేడ్ చేసిన జాతీయ రహదారితో తెలుగు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ పెరగడంతో పాటు, ఇరురాష్ట్రాల ప్రయాణికులకు, పర్యాటకులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో భక్తులు సులభంగా ఘాట్ల వద్దకు చేరుకోవడానికి, పోలవరం ప్రాజెక్ట్ సందర్శించేందుకు వీలవుతుందన్నారు.

# వారిపై చర్యలు ఉంటాయి: మల్లు రవి

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు పంపారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..గత విషయాలను కూడా పరిగణలోకి తీసుకున్నామని వివరించారు. ఈ నివేదికను ఏఐసీసీ చీఫ్, పార్టీ జనరల్ సెక్రటరీకి కూడా పంపిస్తారని అన్నారు. కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశాల మేరకు వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.నాయకులు, క్యాడర్‌కు ఒక మెసేజ్ ఇవ్వాలని అనుకుంటున్నామని మల్లు రవి తెలిపారు. పార్టీపై నెగెటివ్ అభిప్రాయాన్ని కలిగించకుండా ఉండాలంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు.

# త్వరత్వరగా మూసీ భూసేకరణ

(మొదటి పేజీ తరువాయి)

సేకరణ కోసం స్పష్టమైన విధానం తయారు చేసుకోవాలని సూచించారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడాలన్నారు. మూసీ ప్రాజెక్టు ఫేజ్ 2కి వీలైనంత త్వరగా టెండర్‌లను పిలవాలని తెలిపారు. ప్రాజెక్ట్‌లకు అతి తక్కువ వడ్డీకి వచ్చే రుణాలపైన మునిసిపల్ కమిషనర్‌లు దృష్టి సారించాలని సీఎం తెలిపారు. టీడీఆర్‌పై ప్రతి వారం సమీక్ష జరగాలని చెప్పారు. మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయం టెండర్లు తక్షణం పిలవాలని ఆదేశించారు. కొత్వాల్ గూడా బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. త్వరగా పనులు జరిగేలా చూడాలన్నారు. పనుల్లో ఆలస్యం తగదని, నిర్ణీత సమయంలోగా ప్రాజెక్టుల పూర్తికి ముందుకు సాగాలని అన్నారు. హెచ్ఆర్‌డి బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమీక్షా సమావేశానికి సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, సైబరాబాద్ కమిషనర్ సృజన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి, ఎంఆర్డీసీఎల్ ఎండీ ఈ.వి. నరసింహ రెడ్డి, ఎంఆర్డీసీఎల్ జేఎండీ గౌతమి, హాజరయ్యారు.

# ఏడాదిలో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రాజెక్టు పనులను ప్రారంభం నుంచి ముగింపు వరకు సమగ్రంగా సమీక్షించి, ఎక్కడ పనులు నిలిచిపోయాయి, అందుకు కారణాలేంటి.. వాటిని పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలేంటి అనే అంశాలను పాయింట్‌వారీగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సమస్యను గుర్తించకుండా పనులు పూర్తవుతాయి అంటూ కాలయాపన చేయడం సరికాదని, ప్రతి సమస్యకు స్పష్టమైన పరిష్కారం, బాధ్యత, గడువు నిర్ణయించాలని అధికారులకు సూచించారు. భూసేకరణ, అనుమతులు, నిర్మాణ పనులు, నిధులు, కాంట్రాక్టు ఏజెన్సీలకు సంబంధించిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం, అధికారులు, ఇంజినీర్లు, ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రాజెక్టుపై పూర్తి అవగాహన ఉన్న అధికారులతో స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు సమగ్ర సమీక్ష నిర్వహించి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమస్య ఎక్కడ ఉందో ముందుగా గుర్తించాలి.. కారణాన్ని విశ్లేషించాలి.. పరిష్కారాన్ని ఖరారు చేసి అమలు చేయాలి. ఫలితం వచ్చే వరకు నిరంతరం పర్యవేక్షించాలి. దేవాదుల పూర్తి విషయంలో ఎలాంటి కాలయాపనకు తావులేదుఅని మంత్రి స్పష్టం చేశారు.

# వనమహోత్సవ లక్ష్యాన్ని చేరుకోవాలి



తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు25:రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటిన విధంగానే.. నాటిన మొక్కల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రతి మొక్కను సంరక్షిస్తూ వందశాతం మనుగడ సాధించాలని చెప్పారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని సూచించారు. వన మహోత్సవం లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో గ్రామీణ అభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కమిషనర్ దివ్య, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీవో, అడిషనల్ డీఆర్డీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క దిశానిర్దేశంచేశారు. ఉపాధి హామీ పనులు, పంట కుంటల నిర్మాణం, మహిళా సంఘ భవనాల నిర్మాణం, నూతన చేయూత పెన్షన్ల మంజూరుపై సమీక్షించారు. ఇప్పటివరకు 86శాతం మొక్కలు నాటామని తెలిపారు. 6.18 కోట్ల మొక్కలు నాటి లక్ష్యాన్ని నిర్దేశిరచుకుని 5.32 కోట్ల మొక్కలను నాటినట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేయాలని దిశానిర్దేశర చేశారు. మొక్కలకు రక్షణ కంచెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్లలో ఫెన్సింగ్ పటిష్ఠంగా ఉండేలా చూడాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని తెలిపారు. పనికి సిద్ధంగా ఉన్న ప్రతి కూలీకి పని అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. కూలీలకు వారి నివాస ప్రాంతానికి సమీపంలోనే ఉపాధి కల్పించాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో తగినంత పనుల షెల్ఫ్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఔఓఓ‌ఞూ హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని మార్గనిర్దేశర చేశారు. కూలీల సమీకరణ బాధ్యతను క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టంగా అప్పగించాలని నిర్దేశిరచారు. మంజూరైన అన్ని ఫార్మ్ పాండ్ల పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఉపాధితో పాటు నీటి సంరక్షణకు శాశ్వత ఆస్తులుగా అభివృద్ధి చేయాలని మంత్రి సీతక్క సూచించారు. తక్కువ పనితీరు ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశిరచి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఉపాధి పనులతో పాటు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఆదివాసి గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాముల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నిర్దేశిరచారు. ఫార్మ్ పాండ్లు, ఇతర నీటి సంరక్షణ పనులను వేగంగా ప్రారంభించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, నీటి సంరక్షణ, జీవనోపాధి ఆస్తుల సృష్టి ఏకకాలంలో జరగాలని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

# తెలంగాణ పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహణ



**తొలి అక్షరం/చౌటుప్పల్ ఆగష్టు 25:** చౌటుప్పల్,తెలంగాణ పోలీస్ అసోసియేషన్ ఎన్నికల సందర్భంగా మంగళవారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించారు.ఉదయం 7:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు జరిగిన ఎన్నికల ప్రక్రియను చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఎన్నికల నిర్వహణ అధికారి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మధ కుమార్ ఆధ్వర్యంలో సజావుగా నిర్వహించారు.ఎన్నికల్లో అర్హత కలిగిన పోలీస్ సిబ్బంది తమ ఓటు హక్కును ఉత్సాహంగా వినియోగించుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు: 1. కె. నాగరాజు PC 3685 2. పి. శ్రీను PC 4618ం3. వి. శ్రీనివాస్ HC 1843ం4. వి. వీర కృష్ణ PC 96ం5. వి. ఉపేందర్ PC 181ఎన్నికల ప్రక్రియ మొత్తం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. ఎన్నికలను అధికారులు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించారు.

# 18వ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం

- ముని్సపాలిటీ అభివృద్ధిలో భాగంగా పనులు ప్రారంభం.
- పాల్గొన్న చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, వార్డు ముఖ్యులు



**తొలి అక్షరం/చౌటుప్పల్. ఆగష్టు 25:** చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధి పనుల్లో భాగంగా 18వ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు. వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ హాజరై అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపడుతున్నట్లు తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయితే వార్డులో పారిశుధ్య సమస్యలు మరింత మెరుగుపడటంతో పాటు ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్, 17వ వార్డు కౌన్సిలర్ చింతల ఉమా మహేశ్వరి, కో–ఆప్షన్ సభ్యుడు పస్తం గంగారాములు, వార్డు ముఖ్యులు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, గుర్రం వెంకటేశం, చప్పిడి శ్రీనివాస్ రెడ్డి, పబ్బు రవీందర్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, ఎల్లంకి ఎల్లయ్య, సప్పిడి పాపిరెడ్డి, చింతల మహిపాల్ రెడ్డి, కాసోజు నారాయణ, వంగాల రమాకాంత్ గౌడ్, కాసోజు గోపి, పస్తం వెంకటేష్, పందుల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ మహిళలకు వందశాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు... ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి,ఆగస్టు 25:** ఖమ్మం జిల్లాలో బీసీ మహిళలను ఆర్థికంగా స్వావలంబన కలిగిన మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ సంక్షేమశాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఖమ్మం జిల్లాలో ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పథకం క్రింద జిల్లాలోని ప్రతి శాసనసభ నియోజక వర్గానికి 1,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లు చొప్పున, ఒక్కో యూనిట్ విలువ 12 వేలు 100 శాతం ఉచిత సబ్సిడీపై అర్హులైన బీసీ మహిళలకు అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళలు బీసీ వర్గానికి చెందిన నిరుద్యోగ మహిళలై ఉండాలని, 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. నిరాశ్రయులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథలు, అలాగే మేరా/మేరు (MERA/MERU) కమ్యూనిటీకి చెందిన మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలకు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షలకు మించకూడదని, తెల్ల రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం క్రింద అవకాశం ఉంటుందని, కుట్టు వృత్తిలో నైపుణ్యం కలిగిన వారికి, అలాగే కనీస ప్రాథమిక అక్షరాస్యత ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హులైన బీసీ మహిళలు సెప్టెంబర్ 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులను tgobmms.cgg. gov.in పోర్టల్ ద్వారా సమర్పించాలని తెలిపారు.అర్హత కలిగిన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్దేశిత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు.

# చౌటుప్పల్‌లో ఘనంగా వనమహోత్సవం

**13వ వార్డులో మొక్కలు నాటిన చైర్‌పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్ గోశిక వినయ్ కుమార్ వైస్ చైర్మెన్**





**తొలి అక్షరం/చౌటుప్పల్ ఆగష్టు 25:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వనమహోత్సవం2026 కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు జయభూమి వెంచర్‌లో బాలాజీ టెంపుల్ ఎదురుగా ఉన్న 10 శాతం ల్యాండ్‌లో గురువారం పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల విద్యార్థులు, కాలనీవాసులు కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు.“మొక్కలు నాటుదాంపర్యావరణాన్ని పరిరక్షిద్దాం” అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించడంతో పాటు రాబోయే తరాలకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు చెట్ల పెంపకం ఎంతో అవసరమన్నారు. చౌటుప్పల్ పట్టణంలో ఉన్న 30 శాతం అడవి ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు.మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలు నాటడాన్ని తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని కోరారు. కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ మాట్లాడుతూ మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోసనం రాకేష్ రెడ్డి, పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య, పాక చిరంజీవి, పిల్లలమర్రి మధుసూదన్, కో–ఆప్షన్ సభ్యులు పస్తం గంగారాములు, నాయకులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, ఉడుగు రమేష్ గౌడ్ పాల్గొన్నారు.మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, మేనేజర్ అంజయ్య, ఫారెస్ట్ అధికారి మెహరాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, ఐరా పబ్లిక్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ బి. మమత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు, జయభూమి వెంచర్ కాలనీవాసులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలి...


**ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రాధాన్యతా క్రమంలో సివిల్ పనులు చేపట్టాలి వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి వైద్య ఆరోగ్య శాఖలో మౌళిక వసతులు, సివిల్ పనులు, పరికరాలపై వైద్య అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**




**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి,ఆగస్టు 25:** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన మౌలిక వసతులు, వైద్య పరికరాలు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి వైద్య ఆరోగ్య శాఖ, ఇంజినీరింగ్ శాఖ, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మౌళిక వసతులు, సివిల్ పనులు, వైద్య పరికరాలు, ల్యాబొరేటరీలు, డయాగ్నస్టిక్ హబ్‌ల పనితీరుపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ప్రస్తుతం చేపడుతున్న సివిల్ పనులు భవిష్యత్ అవసరాలకు కూడా ఉపయోగపడేలా దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక రూపొందించాలని సూచించారు.ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేపట్టాల్సిన సివిల్ పనులను ప్రాధాన్యతా క్రమంలో గుర్తించాలని అన్నారు. ప్రస్తుతం రోగుల సేవలకు అత్యవసరంగా అవసరమైన సౌకర్యాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరం లేని పనులకు నిధులు ఖర్చు చేయవద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిధులను అత్యంత సమర్థవంతంగా, పొదుపుగా వినియోగించాలని ఆదేశించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సివిల్ పనులకు సంబంధించి సుమారు రూ. 5.20 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినందున వాటిని వేగంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. **ఏరియా ఆసుపత్రులకు పరికరాల కొనుగోలుకు నిధులు**సత్తుపల్లి, మధిర ఏరియా ఆసుపత్రులకు అవసరమైన వైద్య పరికరాల కోసం మొదటి దశలో రూ. 30 లక్షల చొప్పున, కల్లూరు సి.హెచ్.సి. కి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. వైద్య పరికరాల ఎంపికలో ఒకే పరికరంతో ఎక్కువ సంఖ్యలో పరీక్షలు నిర్వహించే అవకాశం ఉండేలా చూడాలని అన్నారు. పరికరాలకు గ్యారెంటీతో పాటు ప్రాథమిక నిర్వహణ, సర్వీసింగ్‌కు సంబంధించి హామీ ఉండేలా కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు.197 సబ్ సెంటర్ కేంద్రాల్లో అవసరమైన సివిల్ పనులకు రూ. 2.165 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలపగా, ప్రతి కేంద్రంలో ప్రజలకు అవసరమైన కనీస మౌళిక వసతులు అందుబాటులో ఉండేలా పనులను గుర్తించాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ డి. రామారావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. రాజశేఖర్, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వేణుమాధవ్, వైద్య ఆరోగ్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, వైద్యాధికారులు, ఇంజినీరింగ్ శాఖ, స్థానిక సంస్థలు, సంబంధిత విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ సమస్యలను పరిష్కరించాలి: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

**భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ ం కోసం భారీగా నిధులు ప్రాజెక్టుల పూర్తికి భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇరిగేషన్ ప్రాజెక్టుల పెండింగ్ సమస్యలపై సమీక్షించిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి**





**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి,ఆగస్టు 25:** రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి నిర్దేశిత ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పునరావాసం పునరావాస పునరుద్ధరణ (ఆర్ అండ్ ఆర్), అటవీ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ సమస్యలపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల పూర్తి చేసి, నిర్దేశిత ఆయకట్టుకు సాగునీరు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ప్రాజెక్టుల వారీగా అవసరమైన భూసేకరణ, పెండింగ్‌లో ఉన్న ఆర్‌అండ్‌ఆర్ చెల్లింపులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. భూసేకరణను చీఫ్ ఇంజినీర్లు ఒక సవాల్‌గా తీసుకుని యుద్ధప్రాతిపదికన పనిచేయాలని మంత్రి సూచించారు. రెవెన్యూఅధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించిన టోకెన్లను త్వరితగతిన క్లియర్ చేయడంతో పాటు పెండింగ్ అవార్డులను వీలైనంత త్వరగా పాస్ చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ల పీడీ ఖాతాలకు చేరిన నిధులు అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన చేరేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు న్యాయమైన పరిహారం అందించి భూమిని సకాలంలో సేకరించాలని మంత్రి సూచించారు. భూసేకరణ ప్రక్రియలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి స్థానిక సమస్యలను పరిష్కరించాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, అటవీ సమస్యల్లో ఎలాంటి అవరోధాలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని, అవసరమైన అంశాలను తన దృష్టికి నేరుగా తీసుకొని రావాలని కలెక్టర్లకు మంత్రి తెలిపారు. కలెక్టర్లు నీటిపారుదల శాఖ కార్యదర్శితో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నీటిపారుదల శాఖ సిఇ వాసంతి, ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి శ్రీకారం

**- పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడిగా ధర్మకర్త బడుగు లక్ష్మయ్య ఏకగ్రీవ ఎన్నిక**




**తొలి అక్షరం/చౌటుప్పల్: ఆగష్టు 25:** పట్టణంలోని పురాతన శివాలయంగా పేరుగాంచిన శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవస్థానం పునర్నిర్మాణ అంశంపై దేవస్థానం ఆవరణలో ధర్మకర్తల మండలి, దేవస్థాన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం పునర్వ్యవస్థీకరణ చేయాలని ధర్మకర్తల మండలి, దేవస్థాన కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.అనంతరం శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవస్థానం పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడిగా దేవస్థాన ధర్మకర్త శ్రీ బడుగు లక్ష్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా బడుగు లక్ష్మయ్య మాట్లాడుతూ దేవస్థాన పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగస్వాములైన ధర్మకర్తలు, కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారం, భాగస్వామ్యంతో దేవస్థాన పునర్నిర్మాణాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు బడుగు జయప్రకాష్, ఉపాధ్యక్షులు నోముల రఘునాథ్, గోశిక బాలాజీ, ప్రధాన కార్యదర్శి గోశిక బాల నరసింహ, సహాయ కార్యదర్శి గోలి శ్రీనివాస్, గోశిక చంద్రకళ నరసింహ, కోశాధికారి బడుగు సుజాత నరసింహ, సాంస్కృతిక కార్యదర్శి బడుగు క్రాంతి కుమార్, ప్రచార కార్యదర్శి కర్నాటి జనార్దన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు, మేజర్ గ్రామపంచాయతీ మాజీ సభ్యులు పెద్ది కృష్ణ, దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు కందగట్ల బిక్షపతి, బడుగు లక్ష్మయ్య, బడుగు శ్రీరాములు, గుర్రం వెంకటేశం, వనం ధనుంజయ, గుర్రం పాండురంగ, గోశిక నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర కమిటీ సభ్యునిగా కొండే శ్రీశైలం

**● తెలంగాణ గొర్రెల మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కమిటీలో చోటు**



**తొలి అక్షరం/చౌటుప్పల్. ఆగష్టు 25:** చౌటుప్పల్: తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర 4వ మహాసభలు, 30వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన కొండే శ్రీశైలం రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు.ఈ నెల 22, 23, 24 తేదీల్లో చెంగిచెర్లలోని జీజీ గార్డెన్స్‌లో నిర్వహించిన మహాసభల్లో రాష్ట్రవ్యాప్తంగా గొర్రెలు, మేకల పెంపకందారులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమం, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం నిర్వహించిన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో కొండే శ్రీశైలానికి రాష్ట్ర కమిటీలో స్థానం లభించింది.రాష్ట్ర కమిటీ సభ్యునిగా తనను ఎన్నుకోవడానికి సహకరించిన సంఘం నాయకులు, సభ్యులకు కొండే శ్రీశైలం కృతజ్ఞతలు తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందారులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# నీట్‌పీజీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి...

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**ఆగస్టు 30న 17,627 మంది అభ్యర్థులతో 56 కేంద్రాల్లో నీట్‌పీజీ పరీక్ష**

**ఎంపిక చేసిన ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతతో అభివృద్ధి చేసి 'బ్రాండ్ తెలంగాణ'ను ప్రపంచస్థాయిలో బలోపేతం చేయాలి**

**వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్**




**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి,ఆగస్టు 25:** ఆగస్టు 30న నిర్వహించనున్న నీట్‌పీజీ 2026 ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నీట్ పీజీ పరీక్ష ఏర్పాట్లు, పర్యాటక అభివృద్ధి పాలసీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా, కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ తో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం లోటు వర్షపాతం నమోదైందని, వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం సెప్టెంబర్ చివరి వరకు పెద్దగా వర్షాలు కురిసే అవకాశం లేదని, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు, సాగునీరు, త్రాగునీటి లభ్యత, తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాల్లో 17,627 మంది అభ్యర్థులు నీట్‌పీజీ పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. అభ్యర్థులు నిర్దేశిత రిపోర్టింగ్ సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్, జనరేటర్ బ్యాకప్, వెలుతురు, వెంటిలేషన్ వంటి మౌళిక సదుపాయాలు సిద్ధంగా ఉండేలా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని సీఎస్ సూచించారు. పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ కు తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు అభ్యర్థుల గుర్తింపు, ఫ్రిస్కింగ్‌ను నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు, బ్లూటూత్ పరికరాలు, ఏఐ గ్లాసెస్, స్పై కెమెరాలు, తదితర నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని, ప్రశ్నాపత్రాల భద్రత, గోప్యతకు పూర్తి రక్షణ కల్పించాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్, నోడల్ అధికారుల ద్వారా పరీక్షా కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సంబంధిత శాఖల సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు.తెలంగాణను దేశ, విదేశీ పర్యాటకులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా తీర్చిదిద్ది తెలంగాణను ప్రపంచస్థాయిలో బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని తెలిపారు. ప్రతి జిల్లాలోని ప్రత్యేక పర్యాటక ప్రాంతాల పరిధిలో ఉన్న ఆధ్యాత్మిక, చారిత్రక, వారసత్వ, ఎకో టూరిజం, హస్తకళలు, జల పర్యాటక ప్రాంతాలను గుర్తించి, వాటిని అనుసంధానిస్తూ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని సీఎస్ ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలకు రహదారులు, పార్కింగ్, త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, శుభ్రత, సూచిక బోర్డులు, ఇతర సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ప్రతి ప్రత్యేక పర్యాటక ప్రాంతానికి స్పష్టమైన అభివృద్ధి కార్యాచరణ, బాధ్యతలు, కాలపరిమితి రూపొందించి పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని సీఎస్ సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్థానిక ఆహారం, సంస్కృతికి ప్రాధాన్యత నిస్తూ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, హోమ్‌స్టేలు, స్థానిక గైడ్ సేవలను ప్రోత్సహించాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల సహజ, చారిత్రక ప్రత్యేకతలను కాపాడుతూ పర్యావరణ హితంగా అభివృద్ధి చేయాలని, ప్రతిజిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాలను ఆకర్షణీయమైన పర్యాటక గమ్యస్థానాలుగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, డిఎంహెచ్ఓ డాక్టర్ రామారావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవి బాబు, పోలీస్, నీట్ పిజీ పరీక్ష సంబంధిత అధికారులు, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుకు అడ్డంగా వేసిన సిమెంట్ పలకలు, మట్టి తొలగింపు

**● ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆదేశాలతో రంగంలోకి దిగిన మున్సిపల్ సిబ్బంది**



**తొలి అక్షరం/చౌటుప్పల్: ఆగష్టు 25:** చైతన్యనగర్‌మణికంఠ వెంచర్ మధ్య సీసీ రోడ్డును కొందరు వ్యక్తులు మూసివేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ అధికారులు స్పందించారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాలతో రోడ్డుకు అడ్డంగా వేసిన సిమెంట్ పలకలు, మట్టిని మున్సిపల్ సిబ్బంది తొలగించారు.రెండు కాలనీల మధ్య సుమారు 20 రోజులుగా రోడ్డుపై మట్టిపోసి, సిమెంట్ పలకలు అడ్డంగా ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారని కాలనీవాసులు తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌తో పాటు ప్రజావాణిలో ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు.దీంతో కాలనీవాసులు సమస్యను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే రోడ్డుకు అడ్డంగా ఉన్న సిమెంట్ పలకలు, మట్టిని తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యే ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది రోడ్డుపై ఉన్న సిమెంట్ పలకలు, మట్టిని తొలగించి ప్రజల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# మొక్కలు నాటడమే కాదు.. వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి...

**పర్యావరణ పరిరక్షణతోనే వేగవంతమైన అభివృద్ధి**

**పచ్చదనం పెరిగితే వర్షపాతం, పర్యావరణ సమతుల్యత మెరుగుపడుతుంది**

**స్తంభాద్రి ప్రకృతి వనం (వెలుగుమట్ల అర్బన్ పార్కును) ఆహ్లాదకరమైన రిక్రియేషన్ ప్రదేశంగా అభివృద్ధి చేయాలి**

**స్తంభాద్రి అర్బన్ పార్కులో వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల**





**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి,ఆగస్టు 25:** మొక్కలు నాటడమే కాకుండా వాటి మనుగడ, సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.స్తంభాద్రి ప్రకృతి వనం (వెలుగుమట్ల) అర్బన్ పార్కులో మంగళవారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌తో కలిసి పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రస్తుతం వన మహోత్సవ కార్యక్రమాల్లో మొక్కలు నాటడంపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నామని, అయితే వాటి మనుగడ, సంరక్షణపై కూడా అంతే శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. మొక్క నాటిన ప్రతి ఒక్కరూ దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.అడవుల నరికివేత, పచ్చదనం తగ్గిపోవడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో తీవ్ర మార్పులు చోటు చేసుకుంటున్నాయని మంత్రి తెలిపారు. పసిఫిక్ మహా సముద్రం ఇంతగా వేడెక్కిన పరిస్థితి గత 150 సంవత్సరాల చరిత్రలో ఎన్నడూ లేదని, రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని అన్నారు.కృష్ణా, గోదావరి, మున్నేరు నదుల్లో ప్రస్తుతం ఆశించిన స్థాయిలో నీటి ప్రవాహం లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. చరిత్రలో బయ్యారం చెరువు నిండకపోవడం వంటి పరిస్థితి ఎప్పుడూ లేదని, ప్రస్తుతం బయ్యారం చెరువులో కూడా నీరు లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వచ్చే ఏడాది త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు.తాను ప్రజా జీవితంలోకి వచ్చిన ప్రారంభ రోజుల్లో వారానికి ఒకసారి నీటి సరఫరా జరిగేదని, ప్రస్తుతం ప్రతిరోజూ త్రాగునీరు అందించే స్థాయికి పరిస్థితులు మెరుగుపడ్డాయని మంత్రి అన్నారు. ప్రజలకు నీరు, రహదారులు, విద్యుత్, మౌళిక వసతులు కల్పించి అభివృద్ధిని వేగవంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంపు ఎంతో ముఖ్యమని మంత్రి తెలిపారు. పచ్చదనం పెరిగితే వర్షపాతం కూడా మెరుగుపడుతుందని అన్నారు. ఈ ఏడాది అటవీ ప్రాంతాల్లోనే ఎక్కువగా వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలు పచ్చదనం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఖమ్మం ప్రజలు స్తంభాద్రి స్తంభాద్రి ప్రకృతి వనం (వెలుగుమట్ల) అర్బన్ ఫారెస్ట్ వంటి పచ్చని ప్రాంతాలను కలిగి ఉండటం అదృష్టమని మంత్రి అన్నారు. పిల్లలను ఇలాంటి ప్రాంతాలకు తీసుకువచ్చి వివిధ రకాల చెట్లు, వాటి ఉపయోగాలను పరిచయం చేయాలని సూచించారు. ప్రస్తుత తరంలో అనేక రకాల చెట్లను గుర్తించలేని పరిస్థితి ఏర్పడుతోందని, పిల్లలకు ప్రకృతి, పర్యావరణంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధిలో మంచి మార్పు సాధ్యమవుతుందని మంత్రి అన్నారు. ప్రజల ఆరోగ్యానికి పరిసరాలు పరిశుభ్రంగా, పచ్చగా ఉండటం ఎంతో అవసరమన్నారు. చెట్లు లేకపోతే ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బును ఆసుపత్రుల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. ఎన్ని కోట్ల రూపాయల సంపద ఉన్నా పర్యావరణం ఆరోగ్యకరంగా లేకపోతే దాని వల్ల ప్రయోజనం ఉండదని మంత్రి అన్నారు. వన మహోత్సవ కార్యక్రమాల సమయంలో మాత్రమే మొక్కలు నాటకుండా ప్రతి ఒక్కరూ తమ జీవితంలో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ఒక అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతోనే వ్యక్తిగతంగా, సమాజంగా అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని మంత్రి కోరారు.ప్రస్తుతం మనం చేస్తున్న పనులు భవిష్యత్ తరాలపై ప్రభావం చూపుతాయని, వారికి మెరుగైన పర్యావరణాన్ని అందించేందుకు మంచి పనులు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్కును పిల్లలు, వృద్ధులు, వాకర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలతో ఆహ్లాదకరమైన రిక్రియేషన్ ప్రదేశంగా అభివృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వృక్షప్రసాదాలు మంత్రి పంపిణీ చేశారు.అంతకుముందు మంత్రి వెలుగుమట్ల పార్క్ ను స్తంభాద్రి ప్రకృతి వనం గా నామకరణం, లోగోను ప్రారంభించారు. యూనియన్ బ్యాంక్ అందించిన బ్యాటరీ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, డిఆర్డీవో శ్రీరామ్, ఆర్డీఓ శ్రీనివాస్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# వెల్‌జర్లలో అంగడి బజార్ ప్రారంభోత్సవం

**•గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్ వెల్లడి**




**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు25:** వెల్‌జర్ల గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతులు తమ పంటలను నేరుగా విక్రయించేందుకు, ప్రజలు నాణ్యమైన కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెల్‌జర్ల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అంగడి బజార్ (కూరగాయల మార్కెట్‌సంత) ఏర్పాటు చేశారు. ఈ సంత ప్రారంభోత్సవం ఈ నెల 26న బుధవారం వెల్‌జర్లలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సంత ద్వారా వెల్‌జర్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు, కూరగాయల వ్యాపారులు, చిన్న వ్యాపారులు, ప్రజలకు ప్రయోజనం కలగనుంది. రైతులకు స్థానికంగానే మార్కెట్ లభించడంతో పాటు ప్రజలకు కూరగాయలు, నిత్యావసర వస్తువులు అందుబాటులోకి రానున్నాయి. కార్యక్రమానికి గ్రామస్థులు, రైతులు, వ్యాపారులు, మహిళలు, యువత, పెద్దలు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సర్పంచ్ ఆర్. బాబు నాయక్, వార్డు సభ్యులు కోరారు.

# ఘనంగా బీపీ మండల్ జయంతి వేడుకలు

**మాజీ కుడా చైర్మన్,ఓబీసీ చైర్మన్,ఎస్.సుందర్ రాజ్ యాదవ్**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండ రాంనగర్ లోనీ బీసీ భవన్ లో ఘనంగా బీపీ మండల్ జయంతి వేడుకలు నిర్వహించారు.బీపీ మండల్ యాదవ్ సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు అని మాజీ కుడా చైర్మన్,ఓబీసీ చైర్మన్,ఎస్.సుందర్ రాజ్ యాదవ్ తెలిపారు.సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు బీపీ మండల్ జయంతిని స్మరించుకోవడం ఎంతో గర్వకారణమని సుందర్ రాజ్ యాదవ్ అన్నారు.హనుమకోండ రాంనగర్ లో బీసీ భవన్ లో బీపీ మండల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్బంగా మాజీ కూడా చైర్మన్,ఓబీసీ చైర్మన్ ఎస్.సుందర్ రాజ్ యాదవ్ హజరై పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్బంగా సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ...సమాజంలో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు,విద్య,ఉద్యోగాల్లో న్యాయం అందాలనే లక్ష్యంతో పనిచేశారని గుర్తు చేశారు.ఆయన నాయకత్వంలో ఏర్పడిన మండల్ కమిషన్ భారతదేశ సామాజిక చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలిచిందన్నారు.వెనుకబడిన వర్గాల సామాజిక,విద్యా పరిస్థితులను అధ్యయనం చేసి వారికి తగిన అవకాశాలు కల్పించాలనే సిఫార్సులు చేయడం ద్వారా బీపీ మండల్ సామాజిక సమానత్వానికి బలమైన పునాది వేసిందని చేప్పారు.నేటి యువత బీపీ మండల్ జీవితాన్ని,ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ ప్రధాన కార్యదర్శి,ప్రొఫెసర్ గడ్డం భాస్కర్,ఉద్యమకారుడు గంగాపురం వేణుమాధవ్ గౌడ్,మేనం శ్యామ్,యాదగిరి గౌడ్,నాగరాజు యాదవ్,చిరంజీవి యాదవ్,యుగేందర్ యాదవ్,బీసీ మహిళా నాయకులు పద్మజ,మౌనిక,తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ ఉత్కంఠ





**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** మంత్రి కొండా సురేఖను క్యాబినెట్ నుంచి,చిన్నారెడ్డిని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ పదవి నుంచి తొలగించాలని క్రమశిక్షణ కమిటీ నిర్ణయించింది.సీఎం రేవంత్ రెడ్డిని కలవనున్న క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ ఉత్కంఠ రేపుతున్న మంత్రి కొండా సురేఖ,చిన్నారెడ్డి విషయంలో నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం ఇద్దరిపై కఠిన చర్యలకు సిఫారసు చేసిన క్రమశిక్షణ కమిటీ ఈ నేపథ్యంలో చర్యలకు కారణాలను రేవంత్ రెడ్డికి వివరించనున్న మల్లు రవి ఇప్పటికే టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు నివేదిక సమర్పించిన క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి,వైస్ చైర్మన్ శ్యామ్ మోహన్ పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లా ప్రజలకు మిలాద్-ఉన్ -నబీ పర్వదిన శుభాకాంక్షలు

**- శాంతి,సోదరభావం ప్రతి ఒక్కరి జీవితంలో వెల్లివిరియాలి: డిసిసి అధ్యక్షుడు అయూబ్**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా ప్రజలకు,ముస్లిం సోదరులకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మిలాద్ -ఉన్ - నబీ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి,కరుణ,సోదరభావం,మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఆయన కోరారు.కుల,మత భేదాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా,సోదరభావంతో జీవించాలని ఆకాంక్షించారు.కులమత సామరస్యం,శాంతి,పరస్పర గౌరవం కోసం ప్రవక్త మహమ్మద్ అందించిన సందేశాలు సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని అయూబ్ పేర్కొన్నారు.మిలాద్ ఉన్ నబీ పర్వదినం ప్రజల జీవితాల్లో శాంతి,సుఖసంతోషాలు నింపాలని,ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఆకాంక్షించారు.

# రూ.1.25 కోట్ల విలువగల 251 కిలోల గంజాయి పట్టివేత

**అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ను అరెస్టు చేసిన దామెర పోలీసులు**

**సుమారు 1 కోటి 25లక్షల విలువగల 251 కిలోల గంజాయి,ఒక ద్విచక్ర వాహనం,9వేల రూపాయల నగదు,ఒక సెల్ ఫోన్ స్వాధీనం**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా వారి బంగారు భవిష్యత్తును కాపాడటంతో పాటు,గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలను విక్రయాలకు పాల్పడే వారిని నియంత్రించి గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు.ఇందులో భాగంగా ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ ఆధ్వర్యంలో దామెర పోలీసులు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ కు పాల్పడుత్ను నిందితుడుని అదుపులోకి తీసుకోని విచారణ చేయగా గంజాయి కోనుగోలు,విక్రయాలకు సంబంధించి కీలక వివరాలను వెలుగులోకి వచ్చాయి.ముదిగొండ నాగేశ్వర్ రావు,వయస్సు 55, పులుకుర్తి గ్రామం,దామెర మండలం,హన్మకొండ జిల్లా కు చెందిన ఇతను సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో నిందితుడు తనకు వున్న నెట్వర్క్ ద్వారా ఒడిషా రాష్ట్రానికి చెందిన రమేష్,సుధాకర్ వద్ద తక్కువ ధరకు గంజాయి కోనుగోలు చేసి తెలంగాణ,మహరాష్ట్ర,కర్ణాటక,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి నిందితులు ఉర్దు,రాందాస్ శేషరావు బీరదార్,అక్లీం,షారుఖ్ ఖాన్,షేక్ అక్బర్,నునావత్ రాజుల ద్వారా ఎక్కువ ధరకు విక్రయించినట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైంది.పోలీసులు పట్టుబడిన నిందితుడు ఇచ్చిన సమాచారం పోలీసులు అతని ఇంటి నుండి సుమారు భారీ మొత్తంలో సుమారు 1కోటి 25లక్షల రూపాయల విలువ గల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.దీనికి సంబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టడంతో పాటు పోలీసులకు పట్టు బడిన నిందితుడు నాగ్వేశ్వర్ రావు నుండి గంజాయి కోనుగోలు చేసిన మిగితా రాష్ట్రాలకు చెందిన నిందితులను పట్టుకొనేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయడం జరిగింది.మత్తు పదార్థాల అక్రమ రవాణాతో పాటు వినియోగంపై తెలంగాణ పోలీస్ విభాగం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడంకోవడంతో పాటు,విక్రయదారులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.మత్తు పదార్థాల కట్టిడికై ప్రజలు సైతం వంతు సహకారం అందించాలని ప్రధానంగా ఎవరైన గంజాయి విక్రయాలకు పాల్పడిన,వినియోగించిన స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు.గంజాయి స్మగ్లర్ ను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పరకాల ఏసిపి సతీష్ బాబు,శాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి,ఆత్మకూర్ ఇన్స్పెక్టర్ సంతోష్,దామెర ఎస్.ఐ. వీరభద్రరావు,శాయంపేట ఎస్.ఐ పరమేశ్వర్,పరకాల ఎస్.ఐ రఘుపతితో పాటు ఏఏఓ సల్మాన్ పాషా,దామెర,శాయంపేట కానిస్టేబుళ్ళను సీపీ అభినందించారు.

# లియాఫీ చౌటుప్పల్ బ్రాంచ్ జనరల్ బాడీ సమావేశం ఘనంగా





**పాలసీదారుల ప్రయోజనాల కోసం లియాఫీ పోరాటం కొనసాగుతుంది: ఎస్.బి. శ్రీనివాస్ చారి**

**తొలి అక్షరం/చౌటుప్పల్,ఆగస్టు 25:** లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ) చౌటుప్పల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఎద్యుకేషన్ సెమినార్, జనరల్ బాడీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లియాఫీ ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ ఎస్.బి. శ్రీనివాస్ చారి, జోనల్ కోశాధికారి గుడి వెంకటయ్య, జోనల్ ఐటీ చైర్మన్ కొండ నరసింహ, సికింద్రాబాద్ డివిజన్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు రామస్వామి, గోవింద్ రెడ్డి, కోశాధికారి భాస్కర్, సికింద్రాబాద్ డివిజన్ క్లియర్ అధ్యక్షులు వజ్రా రెడ్డి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా బ్రాంచ్ అధ్యక్షులు సైదులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి జనార్దన్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి ఎస్.బి. శ్రీనివాస్ చారి మాట్లాడుతూ పాలసీదారులు, ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోసం లియాఫీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. లియాఫీ పోరాటాల ఫలితంగా పాలసీదారుల ప్రీమియంపై జీఎస్టీ మినహాయింపు లభించిందని, ఏజెంట్ల గ్రాట్యుటీ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచినట్లు తెలిపారు.ఏజెంట్ల కమిషన్‌కు సంబంధించి ఐఆర్‌డీఏఐ నుంచి ఏవైనా వ్యతిరేక నిర్ణయాలు వస్తే దేశవ్యాప్తంగా ఉన్న ఏజెంట్లను ఏకం చేసి పోరాటం చేస్తామని, అవసరమైతే ఐఆర్‌డీఏఐ కార్యాలయాన్ని ముట్టడించే స్థాయిలో ఉద్యమాన్ని చేపడతామని శ్రీనివాస్ చారి స్పష్టం చేశారు. ఏజెంట్ల హక్కులు, సంక్షేమం కోసం లియాఫీ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు.**నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక** సమావేశంలో చౌటుప్పల్ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బడుగు లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా జల్ల మల్లేశం, కోశాధికారిగా గుర్రం సత్యపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా రాజారాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో వివిధ బ్రాంచీల నాయకులు కొండ నరసింహ, రంగశెట్టి, పూర్ణచంద్రరావు, భగీర, పద్మారెడ్డి, సత్యనారాయణతో పాటు సీనియర్ ఏజెంట్లు బడుగు సత్యనారాయణ, గుండ్ల శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు నాయకులు, ఏజెంట్లు అభినందనలు తెలిపారు. ఏజెంట్ల ఐక్యతతో సంస్థను మరింత బలోపేతం చేసి, పాలసీదారులు మరియు ఏజెంట్ల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని నూతన కార్యవర్గం ప్రకటించింది.



# పర్యావరణన్ని కాపాడుదాం

**తొలి అక్షరం/దంతాలపల్లి ఆగస్టు 25:** పెద్ద ముప్పారం గ్రామంలో పర్యావరణ భాగంగా గ్రామ సర్పంచ్ శ్రీ కందిమల్ల భరత్ బాబు ప్రజలకు మొక్కలు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సమర్పించాలని పచ్చదనం పెంపొందించడంలో భాగస్వాములు కావాలని సూచించారు మొక్కలు మన భవిష్యత్తుకు ఊపిరి పెద్దదని మన గ్రామానికి అందం ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ లక్ష్మి ఉప్పలయ్య ఒడిశాల మంగమ్మ సుధాకర్ గంగారబోయిన రవళి శ్రీకాంత్ అల్వాల కృష్ణవేణి మధు ధోనలా రవి గుడిసెల సుధాకర్ పాపి మరియు గ్రామ కార్యదర్శి ప్రభు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మొండ్రాయిలో రూ.20 లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



**తొలి అక్షరం/కొడకండ్ల ఆగస్టు 25:** మండల పరిధిలోని మొండ్రాయి గ్రామంలో పాలన మరింత సులభతరం చేసేందుకు నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. వీబీజీ రాంజీ పథకం నిధుల నుండి మంజూరైన రూ. 20 లక్షల వెచ్చించి నిర్మించనున్న ఈ భవనానికి గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భూమి పూజ మరియు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కొడకండ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై, సర్పంచ్‌తో కలిసి సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం పునాది పనులకు శ్రీకారం చుడుతూ గడ్డపారతో ఐదుసార్లు తవ్వకం జరిపి నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధికే ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. భవనాలు లేక ఇబ్బందులు పడుతున్న గ్రామాల్లో సకల సౌకర్యాలతో కూడిన నూతన గ్రామపంచాయతీ భవనాలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పాలకుర్తి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి చొరవతోనే నియోజకవర్గానికి పెద్ద ఎత్తున అభివృద్ధి నిధులు మంజూరవుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. మొండ్రాయి గ్రామానికి రూ. 20 లక్షల నిధులు మంజూరు చేయించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి గ్రామ ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్ నాయక్, గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ సొసైటీల డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు మరియు పురప్రజలు పాల్గొన్నారు.

# చించోడు ఆసుపత్రిలో వన మహోత్సవ కార్యక్రమం..

### పాల్గొన్న గ్రామ సర్పంచ్ ఆర్.శ్రీనివాస్.,చించోడు వైద్య సిబ్బంది



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు25:** రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి నిన్న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ప్రభుత్వ ఆవరణ కార్యాలయంలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించాలని తెలియజేశారు. అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి ఇచ్చిన ఆదేశాల మేరకు , ఈరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రము చించోడు ఆసుపత్రి ఆవరణలో చించోడు ఆసుపత్రి వైద్య సిబ్బంది ఏర్పాటుచేసిన చెట్లు నాటే కార్యక్రమం ను , చించోడు సర్పంచ్ ఆర్.శ్రీనివాస్ చేతులమీదుగా ప్రారంభించారు. సర్పంచ్ ఆర్. శ్రీనివాస్ మొదట నేరేడు చెట్టు నాటి,ఆ చెట్టుకు నీళు పోశారు.తదుపరి ఎమ్.ఎల్.హెచ్.పి.వైద్యాధికారి డాక్టర్ సంధ్యారాణి నిమ్మచెట్టు నాటి నీరు పోశారు.హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు జామ చెట్టు నాటి నీరు పోశారు. అలా గ్రామ వార్డు మెంబర్లు, విలేజ్ సెక్రటరీ,వైద్య సిబ్బంది అందరూ ఒక్కొక్కరు ఒక చెట్టు ఆస్పత్రి ఆవరణలో నాటారు. ఈరోజు చించోడు ఆసుపత్రి ఆవరణలో జామ చెట్లు,నిమ్మ చెట్లు,నేరడి చెట్లు మొత్తం 12 చెట్లు నాటడం జరిగింది అని హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చించోడు సర్పంచ్ రాకల శ్రీనివాస్,వార్డ్ మెంబర్లు ఉమామహేశ్వర్ నాయక్, కుమ్మరి శేఖర్,విలేజ్ సెక్రటరీ జయపాల్ రెడ్డి,ఎం ఎల్ హెచ్ పి వైద్యాధికారులు సంధ్యారాణి,ప్రవీణ,మరియు హెల్త్ ఎడ్యుకేటర్ జె .శ్రీనివాసులు,హెల్త్ సూపర్వైజర్ శ్రీ రామ,ల్యాబ్ టెక్నీషియన్ అశోక్ కుమార్, స్టాఫ్ నర్స్ అరుణ,ఏఎన్ఎంలు అనురాధ,పుష్ప,మధువాణి , ఆస్పత్రి కాంటిజెంటు వర్కర్లు మనెమ్మ ,శ్రీనివాస్ మరియు ఆశాలు మొదలుకు వారు పాల్గొన్నారు.

# రైతాంగా ఉద్యమ నేత మల్లారెడ్డికి ఘన నివాళులు

- రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** సారంపల్లి మల్లారెడ్డి భౌతిక గాయానికి హైదరాబాదులోని ఎంబిభవన్లో పూలమాలవేసి నివార్డులు అర్పించారు.కమ్యూనిస్టు పార్టీ తొలితరంనాయకుడు,రైతు సంఘం ఆలిండియా ఉపాధ్యక్షులు,రైతాంగ ఉద్యమాల నాయకుడు,అలుపెరుగని పోరాటాల ధీరుడు,అమరుడు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి భౌతిక గాయానికి హైదరాబాదులోని ఎంబి భవన్లో పూలమాలవేసి నివాళులు అర్పించిన వారిలో తెలంగాణ రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ,తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్,తెలంగాణ ఉద్యమ నాయకుడు సోమ రామమూర్తి,తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య,సంఘ కోశాధికారి సిర్ల రవీందర్ ఇంకా సంఘ నాయకులు ఇతరులు పాల్గొన్నారు.

# ఇనుగుర్తిలో ఎమ్మార్పీఎస్‌కు కొత్త దిశ.. రమేష్ చేతుల్లో పట్టణ పగ్గాలు

### ఏకగ్రీవ ఎన్నికతో ఐక్యతకు బలమైన ముద్ర
### హక్కుల స్వరం మరింత బలంగా వినిపించేందుకు కార్యాచరణ
### కొత్త కమిటీతో సంఘటిత శక్తికి శ్రీకారం



**తొలి అక్షరం/ఇనుగుర్తి: ఆగస్టు 25:** పదవుల కోసం పోటీ కాదు.. బాధ్యతల కోసం ఏకతాటిపైకి వచ్చిన నాయకత్వం. విభేదాలకు తావులేకుండా ఏకగ్రీవ తీర్పుతో ఇనుగుర్తి పట్టణ ఎమ్మార్పీఎస్‌కు కొత్త కార్యవర్గం కొలువుదీరింది. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, మండల ఇన్చార్జి చెడుపాక యాకన్న ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కమిటీ ఎన్నికలో మల్లెపాక రమేష్‌ను పట్టణ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కొత్త కమిటీలో అధికార ప్రతినిధిగా బూర రాజేష్ (చిన్ని), ప్రధాన కార్యదర్శులుగా తమ్మడపల్లి సురేష్, పసునూరి జంపయ్య, ఉపాధ్యక్షులుగా దేవులపల్లి సునీల్, గుజ్జునూరి మణిరత్నం, గుజ్జునూరి శ్రీకాంత్, కోశాధికారిగా గబ్బెట సురేష్ బాధ్యతలు స్వీకరించనున్నారు. కార్యదర్శులుగా దేవులపల్లి మధు, తమ్మడపల్లి భరత్, ఈసంపల్లి సంపత్ (ఆటో), గుజ్జునూరి జంపయ్య, సహాయ కార్యదర్శులుగా కూరేళ్లి నాగరాజు, ఈసంపల్లి సంపత్, తమ్మడపల్లి రాజు, తూళ్ల యాకయ్య, పులి లక్ష్మణ్, కార్యవర్గ సభ్యుడిగా తమ్మడపల్లి యేసులు ఎంపికయ్యారు.అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన మల్లెపాక రమేష్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని పదవిగా కాకుండా ప్రజల పట్ల తనకప్పగించిన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. మాదిగల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక ప్రయోజనాల కోసం నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు. "మన బలం మన ఐక్యత.. మన అడుగు మన హక్కుల వైపు" అనే సంకల్పంతో ప్రతి కార్యకర్తను కలుపుకొని సంఘాన్ని మరింత చైతన్యవంతంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.ఇనుగుర్తి పట్టణంలో ఎమ్మార్పీఎస్ కార్యకలాపాలను మరింత విస్తరించి, సామాజిక సమస్యలపై సమష్టిగా స్పందించే లా నూతన కమిటీ పనిచేయాలని నాయకులు ఆకాంక్షించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను నాయకులు, కార్యకర్తలు అభినందించారు. కార్యక్రమంలో బూర రజనీకాంత్, పడాల కుమార్, మంకాళి రామ్, సలీం, తమ్మడపల్లి అశోక్, సాగర్, గుజ్జునూరి ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందించిన దైద రవీందర్



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 26:** రామన్నపేట కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన గొర్ల నాగరాజు క్యాన్సర్ వ్యాధి తో బాధపడుతున్నంతో ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్న తనను పరామర్శించి మెడిసిన్ ఖర్చులకు ఆర్థిక సాయం అందజేసిన దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గార్లపాటి రవీందర్ రెడ్డి గాదే ఐలయ్య లింగారెడ్డి బొడ్డు శంకరయ్య గాదె మల్లయ్య శ్రీకాంత్ మధు తదితరులు పాల్గొన్నారు

# దీక్ష కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 26:** హైదరాబాద్ లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో 48 గంటల నిరాహార దీక్ష చేస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు కి పూర్తి మద్దతు తెలియజేయడం జరిగింది. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న విద్యార్థుల యొక్క ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం రోజున పార్టీ కార్యాలయంలో వారిని కలిసి మద్దతు తెలియజేస్తూ దీక్షలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకల్ నియోజకవర్గ ఇన్చార్జి నకిరేకంటి. మొగులయ్య మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వనం అంజయ్య నకిరేకంటి. రవి తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణను కాపాడుకోవాలి

- తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 25:** ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణను కాపాడుకోవాలని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ అన్నారు.పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం తొర్రూర్ పట్టణ కేంద్రంలోని స్థానిక జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు.ఈ సందర్భంగా చైర్మన్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తొర్రూరు మున్సిపాలిటీ ఎప్పుడు ముందుంటుందని పచ్చదనమే పట్టణ అభివృద్ధికి నిజమైన గుర్తింపు అని అన్నారు ప్రజల సంక్షేమం మౌలిక వసతుల అభివృద్ధి పర్యావరణ పరిరక్షణ అనే మూడు ప్రధాన లక్ష్యంతో మున్సిపాలిటీ ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రతి ఇంట ఒక మొక్క ప్రతి పౌరుడు ఒక సంరక్షుడు అనే సందేశంతో ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించి హరిత తొర్రూరు నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పర్యావరణ పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో మొక్కలు మాట్లాడడం జరుగుతుందన్నారు.ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కలను నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు."ప్రతి ఇంటా ఒక మొక్క ప్రతి పౌరుడు ఒక సంరక్షకుడు" అనే సందేశంతో ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించి హరిత తొర్రూరు నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్, పాఠశాల హెచ్ఎం జెల్లా లక్ష్మీనారాయణ,కౌన్సిలర్లు భూసాని జయమ్మ ఉప్పలయ్య, తూర్పాటి రవి, పేర్ల జంపన్న, మాడుగుల భవానీ లత, కిన్నెర కవిత సతీష్, ముద్దసాని సురేష్, కర్నే నాగరాజు, ధారావత్ పద్మ కిషన్, బసనబోయిన ఐలమ్మ,వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.



# సుశ్రుత గ్రామీణ వైద్యుల సమావేశం

**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 26;** రామన్నపేట మండలంలో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం సమావేశం జరిగింది.మండల గ్రామీణ వైద్యులు అందరూ హాజరైనారు.జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య గౌడ్ మరియు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు హనుమంతరావు మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు ఆడపిల్లను (అమ్మ) ను కాపాడుకుందాం అనే నినాదంతో మన సంఘం నడుస్తుంది.ఆర్ఎంపి పి.ఎం.పి డాక్టర్లు ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితమైన వైద్యం చేసుకోవాలని తగు సూచనలు ఇచ్చారు.కార్యక్రమంలో నల్లగొండ జిల్లా సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘ వ్యవస్థాపకులు డి.ఎస్.ఎన్ చారి,యాదాద్రి జిల్లా సంఘ ఆర్గనైజర్ రొయ్యల శంకర్,రామన్నపేట మండల అధ్యక్షులు ఉయ్యాల కృష్ణమూర్తి గౌడ్,ప్రధాన కార్యదర్శి కె.వి.సుధాకర్ రాజు,కోశాధికారి మధు, కరుణాకర్,ఎస్.పి.రాయ్, నాగేశ్వర్,బిక్షపతి, అంజయ్య, రామేశ్వరం, యాదగిరి,నరసింహ, రమేష్,వినయ్ పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 25:** యాదాద్రి-భువనగిరి జిల్లా, రామన్నపేట జిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత పదేళ్లుగా అర్హులకు రేషన్ కార్డులు మంజూరు కాలేదన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని చెప్పారు. పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని అన్నారు. రామన్నపేట పట్టణంలో అర్హులకు త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మోత్కులగూడాలో ఘనంగా వనమహోత్సవం



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 25:** నందిగామ మండలం మోత్కులగూడా గ్రామంలో పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో మంగళవారం 'గ్రీన్ మోత్కులగూడా' కార్యక్రమంలో భాగంగా వనమహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్ ఆధ్వర్యం వహించారు.పాఠశాల ఆవరణంలోనూ, గ్రామ పంచాయతీ ఆవరణంలోనూ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావణ్య రమేష్ మాట్లాడుతూ, పచ్చదనమే ప్రగతికి మెట్టు అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి, దాన్ని బిడ్డలా సంరక్షించాలని సూచించారు. మొక్కల పెంపకం ద్వారా స్వచ్ఛమైన గాలి లభించడంతో పాటు పర్యావరణ సమతుల్యత నెలకొని, భూగర్భ జలాలు పెరుగుతాయని ఆమె వివరించారు.భావి తరాలకు పచ్చని భవిష్యత్తును అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను సంరక్షించాలని, మోత్కులగూడాను ఆదర్శ 'గ్రీన్ విలేజ్'గా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయులు,ఉపసర్పంచ్ వానరసి నర్సింహా, మాజీ సర్పంచ్ వానరాసి ఏలమ్మ నరసింహులు, వార్డు సభ్యులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ యువత, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేట మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 26:** జాతీయ యువజన కాంగ్రెస్ పిలుపుమేరకు రామన్నపేట యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బట్టే సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఇటీవల జరిగిన ఢిల్లీ నిరసన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం పైలట్ గనులను విద్యార్థులపై ఉపయోగించినందుకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ లేదా కేంద్ర ప్రభుత్వం వెంటనే అమిత్షాను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని నిరసన వ్యక్తం చేస్తూ, రానున్న రోజుల్లో బిజెపి ప్రభుత్వం ఇలాంటి ఘటనలకు పాల్పడితే రామన్నపేట యువజన కాంగ్రెస్ తరపున భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని రామన్నపేట యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బట్టే సంతోష్ కుమార్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నకిరేకల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పున్న అమరేందర్, రుద్రాల విక్కీ సాయి, సుర్వి సతీష్, చిరబోయిన నవీన్, కామిటికారి సాయి వెంకట్, సుర్వి నవీన్, లెంకల ఉమేష్, వేణు, సుర్వి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# సహాయ ఫౌండేషన్ బాసట.. ఆధార్‌తో అడుగు పెడితే ఉపాధి బాట!



**పని చేయాలనే తపనకు విలువ.. పేద యువతకు ఉద్యోగమే లక్ష్యంగా ప్రత్యేక అవకాశం**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 25:** హైదరాబాదులో ఉపాధి కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలిచేందుకు సహాయ ఫౌండేషన్ ముందడుగు వేసింది. పనిచేసి స్వంత కాళ్లపై నిలబడాలనే సంకల్పం ఉన్నవారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. డా. రఘు, డా. నీలు మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాలుగా యువతకు ఉపాధి కల్పించడంతో పాటు వృద్ధులకు సేవ చేయాలనే సంకల్పంతో తమ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. “పని చేయాలనే మనసు ఉన్నవారికి అవకాశం దొరకాలి.. పేదరికం కారణంగా ఎవరూ ఉపాధికి దూరం కాకూడదు” అనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగం కోసం ఆసక్తి ఉన్నవారు ముందుగా 9000383755 నంబర్‌కు సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం ఆధార్ కార్డుతో ఉద్యోగ అవకాశం, సుమారు ₹20,000 వరకు జీతం, ఉచిత భోజనం, ఉచిత వసతి సదుపాయాలు ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉద్యోగం కోసం వెతుకుతున్న ప్రతి ఒక్కరూ ముందుగా పని స్వభావం, అర్హతలు, చేరిక విధానం, ఇతర నిబంధనలను ఫౌండేషన్ నిర్వాహకులను సంప్రదించి తెలుసుకుని అవకాశం వినియోగించుకోవాలని సూచించారు. పని చేయాలనే సంకల్పం ఉన్న చేతులకు ఉపాధి అందించాలనే లక్ష్యంతో సహాయ ఫౌండేషన్ చేస్తున్న ఈ ప్రయత్నం పేద కుటుంబాలకు కొత్త ఆశను కలిగిస్తోంది.

# చరిత్ర సృష్టించిన ధ్రువ్ జురెల్..



టీమిండియా యువ వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ చరిత్ర సృష్టించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) చరిత్రలో విదేశీ గడ్డపై ఏడు అంత కంటే తక్కువ స్థానంలో ఆడి అత్యధిక పరుగులు చేసిన తొలి భారత బ్యాటర్‌గా నిలిచాడు. అంతేకాకుండా శ్రీలంక గడ్డపై ఏడో స్థానంలో వచ్చి సెంచరీ చేసిన తొలి భారత బ్యాటర్‌గా కూడా గుర్తింపు పొందాడు. కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్ట్‌లో ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ధ్రువ్ జురెల్ (177 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 115 నాటౌట్) అజేయ శతకంతో రాణించిన సంగతి తెలిసిందే. ఈ సెంచరీతో ధ్రువ్ జురెల్ తన పేరిట పలు రికార్డ్‌లను లిఖించుకున్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చరిత్రలోనే విదేశాల్లో జరిగిన టెస్ట్‌ల్లో ఏడు లేదా అంతకంటే తక్కువ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి సెంచరీ బాదిన మూడో భారత బ్యాటర్ ధ్రువ్ జురెల్. అతని కంటే ముందు రవీంద్ర జడేజా, నితీష్ కుమార్ రెడ్డి ఈ ఫీట్ సాధించారు. 2024లో ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో మెల్‌బోర్న్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో 8వ స్థానంలో బ్యాటింగ్ చేసిన నితీష్ కుమార్ రెడ్డి 114 పరుగులు చేశాడు. 2022లో ఇంగ్లండ్‌తో జరిగిన బర్మింగ్‌హామ్ టెస్ట్‌లో ఏడో స్థానంలో బ్యాటింగ్ చేసిన రవీంద్ర జడేజా 104 పరుగులు చేశాడు. తాజాగా ధ్రువ్ జురెల్ 115 పరుగులతో అజేయంగా నిలిచి ఈ ఇద్దర్ని వెనక్కి నెట్టి ఏడు లేదా అంతకంటే తక్కువ స్థానాల్లో బ్యాటింగ్ చేసి అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా గుర్తింపు పొందాడు. ఓవరాల్‌గా ఈ ఫీట్ సాధించిన 9వ బ్యాటర్‌గా జురెల్ నిలిచాడు. ఈ జాబితాలో రిషభ్ పంత్(159) అగ్రస్థానంలో ఉన్నాడు. శ్రీలంకతో టెస్ట్‌ల్లో సెంచరీ బాదిన నాలుగో భారత వికెట్ కీపర్ కమ్, ఏడో బ్యాటర్‌గా కూడా ధ్రువ్ జురెల్ నిలిచాడు. అతని కంటే ముందు శ్రీలంకపై కపిల్ దేవ్, ధోనీ, రవీంద్ర జడేజా ఈ ఫీట్ సాధించారు. అయితే శ్రీలంక గడ్డపై సెంచరీబాదిన తొలి నెంబర్ 7 భారత బ్యాటర్‌గా ధ్రువ్ జురెల్ గుర్తింపు పొందాడు.

# మిలాద్-ఉన్-నబీ ప్రేమకు చిరునామా

ఆకాశం నక్షత్రాలతో వెలిగిన రాత్రి కాదు
మానవ హృదయాలే వెలుగులతో
నిండిన రోజు ఇది
దైవ సందేశాన్ని
మోసుకొచ్చిన మహనీయుని జ్ఞాపకం,
ప్రపంచానికి కరుణను నేర్పిన పవిత్రమైన పర్వదినం ఇది
మహమ్మద్ ప్రవక్త పేరు పలికితే
మనసులో గౌరవం మొలవాలి
ఆయన చూపిన మార్గం గుర్తొస్తే
మనలో మానవత్వం మేల్కొనాలి
ఆకలితో ఉన్నవాడి కన్నీటిని తుడవమన్నారు,
అనాథను ఆదరించమన్నారు,
పేదవాడిని ప్రేమించమన్నారు,
పొరుగువాడి
సుఖమే మన సుఖమని నేర్పించారు.
ద్వేషానికి బదులు ప్రేమను చూపిన మహనీయుడు
కోపానికి బదులు క్షమను నేర్పిన మహనీయుడు
అహంకారానికి బదులు వినయాన్ని
చూపిన మహనీయుడు
మానవత్వానికే మహోన్నత
స్థానాన్ని ఇచ్చిన మహనీయుడు
ఆయన జన్మదినాన్ని జ్ఞాపకం
చేసుకోవడం అంటే
కేవలం ఒక పండుగను జరుపుకోవడం కాదు
ఆయన బోధించిన మంచిని
మన జీవితాల్లో ఆచరించడం
ఒకరి కన్నీటిని మరొకరు తుడవడం
ఒకరి బాధకు మరొకరు అండగా నిలవడం
మసీదుల మినారెట్ల
నుంచి వినిపించే ప్రార్థనలలో,
ముస్లిం సోదరుల హృదయాల్లో పొంగే భక్తిలో,
చిన్నారి పెదవులపై మెరిసే చిరునవ్వులో,
ప్రతి మంచి పనిలో
ప్రవక్త సందేశం పరిమళించాలి
మతం మనల్ని విడదీయడానికి కాదు
మంచితనం మనల్ని కలపడానికి కావాలి.
పేర్లు వేరైనాడ ప్రార్థనలు వేరైనా
మనిషి కన్నీటి విలువ మాత్రం ఒక్కటే.
ఈ మిలాద్-ఉన్-నబీ పవిత్ర వేళ
ప్రతి ముస్లిం కుటుంబంలో
ఆనందం వెల్లివిరియాలి
ప్రతి ఇంటిలో శాంతి నెలకొనాలి
ప్రతి హృదయంలో ప్రేమ నిండాలి
ప్రతి అడుగులో ప్రవక్త చూపిన
సత్పథం నడవాలి
మహమ్మద్ ప్రవక్త బోధనలు
మన మాటల్లో కాదు.. మన చేతల్లో కనిపించాలి.
మన ప్రార్థనల్లో మాత్రమే కాదు
మన సేవలోనూ ప్రతిధ్వనించాలి.
ప్రేమ పంచే ప్రతి చేయి పవిత్రం కావాలి
ఆకలి తీర్చే ప్రతి గుండె గొప్పది కావాలి
కన్నీరు తుడిచే ప్రతి మనిషి
ప్రవక్త చూపిన మానవతా మార్గానికి ప్రతిరూపం కావాలి
మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు
ప్రేమ వెలగాలి.. శాంతి వెల్లివిరియాలి
మానవత్వం ప్రతి హృదయంలో చిరస్థాయిగా నిలవాలి.

– తాడూరి సంపత్



# సెమీఫైనల్ రేసు నుంచి వైదొలిగిన భారత్

**• అర్జెంటీనా చేతిలో**


**3-5 గోల్స్ తేడాతో ఓటమి**



పురుషుల హాకీ వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్‌లో భారత జట్టుకు పరాభవం కలిగింది.. సోమవారం అర్జెంటీనాతో జరిగిన కీలకమైన పూల్ ఈ మ్యాచ్‌లో భారత్ 3-5 గోల్స్ తేడాతో ఘోర ఓటమి ఎదుర్కొంది. సెమీఫైనల్ చేరాలంటే కనీసం మూడు గోల్స్ తేడాతో గెలవాల్సిన తప్పనిసరి పరిస్థితిలో బరిలోకి దిగిన భారత జట్టు, ఆరంభం నుంచే తీవ్ర ఒత్తిడిలో కూరుకుపోయింది. ఈ ఓటమితో పూల్ ఈ లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఒక్క పాయింట్ కూడా సాధించలేకపోయిన ఇండియా సెమీస్ ఆశలు ఆవిరయ్యాయి. పూల్ ఈ నుంచి నెదర్లాండ్స్ ఇప్పటికే సెమీఫైనల్ బెర్తును దక్కించుకుంది. మ్యాచ్ మొదలైన మొదటి నిమిషంలోనే అర్జెంటీనా ఆటగాడు జోక్విన్ తోస్కాని అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి భారత గోల్ కీపర్ మోహిత్ ను బురిడి కొట్టించాడు. ఆ తర్వాత ఆరో నిమిషంలో నికోలస్ డెల్లా టోర్రే పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచి అర్జెంటీనా ఆధిక్యాన్ని 2-0 తో రెట్టింపు చేశాడు. 10వ నిమిషంలో అభిషేక్ అందించిన పాస్‌తో సుఖ్‌జీత్ సింగ్ గోల్ కొట్టి భారత్‌ను రేసులోకి తెచ్చేందుకు ప్రయత్నించాడు. అయితే పాసింగ్ లోపాలు, బంతి నియంత్రణ కోల్పోవడం వల్ల భారత దాడులు వరుసగా నిరాశ పర్చాయి. రెండో క్వార్టర్‌లో ఎలాంటి గోల్స్ నమోదు కాకపోవడంతో హాఫ్ టైమ్ సమయానికి భారత్ 1-2 తో వెనుకంజలో నిలిచింది. మూడో క్వార్టర్ ప్రారంభమైన వెంటనే అర్జెంటీనా మరింత దూకుడు కనబర్చింది. 33వ నిమిషంలో టోమస్ డొమెనె రివర్స్ హిట్‌తో గోల్ చేసి ఆధిక్యాన్ని 3-1 కి పెంచాడు.

ఆ తర్వాత భారత డిఫెన్స్ చేసిన తప్పిదాన్ని సొమ్ము చేసుకుంటూ డొమెనె పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా మార్చి స్కోరును 4-1 గా తిరుగులేని విధంగా మలిచాడు. దీంతో టోర్నమెంట్‌లో అతడి గోల్స్ సంఖ్య ఏడుకు చేరి, హర్మన్‌ప్రీత్ సింగ్ (6 గోల్స్) ను దాటాడు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ డ్రాగ్ ఫ్లిక్స్‌ను అర్జెంటీనా డిఫెండర్లు సమర్థవంతంగా అడ్డుకోవడంతో భారత్‌కు దక్కిన పెనాల్టీ కార్నర్లు వృథాగా మారాయి. 53వ నిమిషంలో లూకాస్ తోస్కాని అర్జెంటీనా తరఫున ఐదో గోల్ నమోదు చేశాడు. మ్యాచ్ చివరి నిమిషాల్లో 58వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ తన రెండో గోల్ నమోదు చేయగా, 59వ నిమిషంలో హార్దిక్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా చేశాడు. అయినప్పటికీ భారత్ 3-5 తో ఓటమి పాలైంది. భారత్ ఏడు లేదా ఎనిమిదో స్థానం కోసం జరిగే క్లాసిఫికేషన్ మ్యాచ్‌లలో ఆడాల్సి ఉంటుంది.

# మేధావి బిధూరి సిక్స్ సెవెన్ సెలబ్రేషన్ వైరల్



విమెన్స్ ఢిల్లీ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూడీపీఎల్) 2026 సీజన్ ఓపెనింగ్ మ్యాచ్ లో యువ లెగ్ స్పిన్నర్ మేధావి బిధూరి చేసిన వినూత్న వికెట్ సంబరం ఇంటర్నెట్ లో సెన్సేషన్ గా మారి పోయింది. సెంట్రల్ ఢిల్లీ క్వీన్స్ తరఫున ఆడుతున్న బిధూరి, సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్జ్ బ్యాటర్ నిషికా సింగ్ ను 16వ ఓవర్లో అవుట్ చేసిన తర్వాత చేసిన “6-7” సెలబ్రేషన్ అభిమానులను విపరీతంగా అలరించింది. ఆరుషి గోయల్ మిడ్ వికెట్ లో క్యాచ్ పట్టగానే బిధూరి వేళ్లతో చేసిన ఈ జెస్చర్ వీడియో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో విపరీతంగా షేర్ అవుతోందని తెలుస్తోంది. మ్యాచ్ ముగిసిన తర్వాత మేధావి బిధూరి మాట్లాడుతూ ఈ సెలబ్రేషన్ వెనుక ఉన్న అసలు కారణాన్ని వివరించింది. మొదట ఆమె 12వ నంబర్ జెర్సీని తీసుకోవాలని అనుకున్నప్పటికీ, ఆ నంబర్ అప్పటికే వేరే ప్లేయర్‌కు కేటాయించడంతో ఆమె 67వ నంబర్ జెర్సీని సెలెక్టు చేసుకుంది. “ప్రస్తుతం ఈ సిక్స్-సెవెన్ ట్రెండ్ నడుస్తోంది. నా చెల్లెలు నన్ను 67వ నంబర్ జెర్సీ ధరించమని, వికెట్ పడినప్పుడు ఇలాగే సెలబ్రేట్ చేసుకోమని సూచించింది” అని మేధావి పేర్కొంది. ఢిల్లీ డొమెస్టిక్ క్రికెట్ సెటప్‌లో మేధావి బిధూరి చాలా కాలంగా స్థిరమైన ప్రదర్శన నమోదు చేస్తోంది. అండర్-19 స్థాయిలో ఢిల్లీకి ప్రాతినిధ్యం వహించిన ఈ రైట్ ఆర్మ్ లెగ్ స్పిన్నర్, గత 2025 సీజన్ ఫైనల్లో సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్జ్ తరఫున ఆడి 3/26 గణాంకాలతో జట్టును ఒక్క పరుగు తేడాతో ఛాంపియన్‌గా నిలపడంలో అద్భుత ప్రదర్శన కనబర్చింది. విమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2024 వేలంలోనూ ఆమె పేరు నమోదు కావడం విశేషం. మేధావి బిధూరి సెలబ్రేషన్ క్రేజ్ ఎంతలా పెరిగిందంటే భారత వెటరన్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ కూడా దీన్ని కాపీ చేసి, సరదా తీర్చుకున్నాడు. ఇంగ్లాండ్‌లో జరుగుతున్న కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో నార్తాంప్టన్‌షైర్ తరఫున ఆడుతూ లాంక్షైర్ బ్యాటర్ జో మూర్స్ ను అవుట్ చేసిన తర్వాత చాహల్ ఇదే “6-7ష గెస్చర్‌తో దుమ్మురేపాడు. ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో చాహల్ చేసిన ఈ పనితో భారత మహిళా క్రికెటర్ స్టైల్ అంతర్జాతీయ స్థాయిలో మరింతగా పాపులర్ అయిందనడంలో సందేహం లేదు.

# దేశ విభజన నేపథ్యంలో
# బట్వారా 1947




### పేలవ ప్రదర్శనతో ఆకట్టులోకపోయిన చిత్రం

సన్నీ డియోల్ హీరోగా దేశ విభజన గాథ నేపథ్యంలో ఆమిర్ ఖాన్ నిర్మించిన 'బట్వారా 1947' చిత్రం ఆగస్ట్ 14న విడుదలైంది. ఈ సినిమా బాక్సాఫీస్ బరిలో చాలా పేలవమైన ప్రభావాన్ని చూపించింది. దీనికి ముందు ఇదే తరహాలో వచ్చిన 'మై వాపస్ ఆవుంగా' దీనికంటే బెటర్ గా పెర్ఫార్మ్ చేసిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'బట్వారా' చిత్రంతో ఆమిర్ ఖాన్‌కు దాదాపు 90 కోట్ల నష్టం వచ్చిందని అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పుడీ సినిమా ఓటీటీ డీల్ సందిగ్ధంలో పడింది. నిజానికి సినిమా రిలీజ్ కు ముందు ఓ ప్రముఖ ఓటీటీ సంస్థ రూ. 125 కోట్లను ఆఫర్ చేసిందట. కానీ అప్పుడు అందుకు ఆమిర్ ఖాన్ అంగీకరించలేదని తెలిసింది. ఇప్పుడు సినిమా విడుదలై పరాజయం పాలు కావడంతో ఏ ఓటీటీ ప్లాట్ ఫామ్ కూడా దీని హక్కులపై ఆసక్తి చూపడం లేదట. 'బట్వారా' సినిమా విడుదలకు ముందే ఓటీటీ డీల్ కుదర్చుకోమని, ఆ కారణంగా ఆర్థికంగా ఉపయోగపడుతుందని ఆమిర్‌కు సన్నీడియోల్ చెప్పినట్టు వార్తలు వచ్చాయి. అయితే ఆయన దానిని ఖండించారు. తమ మధ్య ఓటీటీ డీల్‌కు సంబంధించి ఎలాంటి చర్చ జరగలేదని ఆయన అన్నారు. 'బట్వారా' సినిమా విషయంలో తాను గర్వం పడుతుంటానని, బాక్సాఫీస్ ఫలితాలు సినిమా క్వాలిటీని ప్రతిఫలించవని ఆయన తెలిపారు. తన తండ్రి కెరీర్ లో హృషికేశ్ ముఖర్జీ తీసిన 'సత్యకామ్' ఉత్తమ చిత్రంగా తాను భావిస్తానని, కాని ఆ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ పరాజయాన్ని చవిచూసిందని సన్నీ డియోల్ చెప్పారు. అయితే 'బట్వారా' నష్టాలు రాబోయే రోజుల్లో భర్తీ అవుతాయనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

C i n e m a




M a d n e s s


## తెలుగులో విడుదలవుతున్న 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్'

మలయాళ సినీ పరిశ్రమలో సంచలన విజయాలను నమోదు చేస్తూ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న సరికొత్త ఫీల్-గుడ్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'బెత్లెహెమ్ కుడుంబ యూనిట్' ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్' అనే పేరుతో రాబోతున్న ఈ సినిమాను టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఘనంగా విడుదల చేయబోతుంది.యువ కథానాయకుడు నివిన్ పౌలి హీరోగా, సెన్సేషనల్ నటి మమితా బైజు నాయికగా నటించిన ఈ చిత్రానికి గిరీష్ ఎ.డి. దర్శకత్వం వహించారు. కేరళలో ఓణం కానుకగా విడుదలైన ఈ సినిమా అంచనాలకు మించి భారీ వసూళ్లను రాబట్టడమే కాకుండా, ప్రేక్షకుల నుంచి ప్రశంసల వర్షాన్ని అందుకుంది. ముఖ్యంగా నివిన్ పౌలి నటన మరియు మమితా బైజుతో ఆయన ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఎంతగానో కట్టుపడేసింది. ఇక 'ప్రేమలు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు అత్యంత దగ్గరైన మమితా బైజు నటిస్తున్న మరో చిత్రం కావడంతో టాలీవుడ్‌లోనూ ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. భావనా స్టూడియోస్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ఫ్యూచర్ రన్-అప్ సహకారంతో మైత్రీ రిలీజ్ సంస్థ తెలుగు ప్రేక్షకులకు అందిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది. మలయాళంలో తిరుగులేని విజయం సాధించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులను కూడా కచ్చితంగా అలరిస్తుందని చిత్రయూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

## ఇరుముడికి ఫ్యామిలీ ఆడియెన్స్ బ్రహ్మరథం

### - కలెక్షన్లలో వందకోట్ల క్లబ్బుకు చేరిన మూవీ

మాస్ మహారాజా రవితేజ హీరోగా, దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన తాజా చిత్రం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ సినిమా కలెక్షన్ల పరంగా సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ మార్క్‌ను అందుకుంది. రవితేజ కెరీర్‌లో అత్యంత వేగంగా రూ.100 కోట్ల గ్రాస్ క్లబ్‌లో చేరిన చిత్రంగా 'ఇరుముడి' నిలిచింది. చాలా కాలంగా ఒక భారీ కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న రవితేజకు ఈ చిత్రం కెరీర్‌లోనే ప్రత్యేకమైన విజయాన్ని అందించిందని అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.సాధారణంగా వీకెండ్ ముగిసిన తర్వాత వచ్చే మొదటి సోమవారం చాలా సినిమాల బుకింగ్స్, ఆక్యుపెన్సీలు తగ్గడం సహజం. కానీ 'ఇరుముడి' విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపించింది. విడుదలైన నాలుగో రోజు కూడా సినిమా బుకింగ్స్ బలంగా కొనసాగడంతో ట్రేడ్ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. మొదటి రోజు స్థాయికి దగ్గరగా బుకింగ్స్ నమోదవడం 'ఇరుముడి'పై ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. రీజినల్ సినిమాల్లో ఫస్ట్ మండే బుకింగ్స్ పరంగా కూడా ఈ చిత్రం కొత్త రికార్డులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. 'ఇరుముడి' హవా టికెట్ సేల్స్‌లోనూ స్పష్టంగా కనిపిస్తోంది.




### ఏకి పడేసిన నటి, ఎంపి కంగనా రనౌత్

కృతి సనన్ ఇటీవల నటించిన ఓ యాడ్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఇప్పటికే నెట్టింట విమర్శలు రాగా.. బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ తాజాగా మండిపడ్డారు. రక్షా బంధన్ అంటే ప్రతి సోదరికీ ఎంతో ప్రత్యేకమైన రోజు. అంత గొప్ప సమయంలో హుందాగా కనిపించాలి. ఈ సాంప్రదాయ పండగకు సంబంధించిన ప్రకటనలో ఇలాంటి దుస్తులా ధరించేది. ఈ రోజుల్లో మహిళలకు లెహంగాలు, జీన్స్, సల్వార్ కమీజ్, చీరలు, పంజాబీ డ్రెస్‌లు.. ఇన్ని రకాలు ఉన్నాయి. ఇన్ని ఉన్నా.. ఇలాంటి బికినీ ధరించి రాఖీ ఎందుకు కడతారు?. ఈ యాడ్ చేసిన స్టైలిష్ట్‌కు ఈ ఆప్షన్లు కనిపించలేదా? ఈ యాడ్ ఉద్దేశపూర్వకంగా చేసినట్లుంది. చాలా అసహ్యంగా కనిపిస్తోందని తన ఇన్‌స్టాలో రాసుకొచ్చారు. ఇటీవల విడుదలైన ఈ యాడ్‌పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా కృతిని ట్రోల్ చేస్తున్నారు. డ్రెస్‌తో పాటు.. ఈ యాడ్‌లో పెంపుడు కుక్కకు రాఖీ కడుతూ కృతి కనిపించడంతో విమర్శలు మరింత ఎక్కువయ్యాయి. ఈ యాడ్‌పై ఇప్పటి వరకూ యాజమాన్యం, కృతి సనన్ స్పందించలేదు.




## బికినీలో కృతిసనన్ రక్షాబంధన్ సెలబ్రేషన్స్

## నటనను నీ నుంచి నేర్చుకోవాల్సిందే

### - బేబీ నక్షత్రకు నటుడు ధనుష్ ప్రశంసలు

'ఇరుముడి' చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ అందుకుంటోంది. ముఖ్యంగా సినిమాలోని కథ, భావోద్వేగ సన్నివేశాలు, నటీనటుల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో రవితేజ నటనతో పాటు ఆయన కుమార్తె పాత్రలో నటించిన బాలనటి బేబీ నక్షత్ర నటనకు విశేష ప్రశంసలు దక్కుతున్నాయి. తండ్రి-కూతుళ్ల మధ్య ఉండే అనుబంధాన్ని తెరపై ఎంతో భావోద్వేగంగా చూపించడంలో ఈ ఇద్దరి నటన కీలక పాత్ర పోషించిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. 'ఇరుముడి' సక్సెస్ మీట్ తర్వాత దర్శకుడు శివ నిర్వాణ బేబీ నక్షత్రకు ఒక ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇచ్చారు. జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ నటుడు ధనుష్‌తో నక్షత్రకు వీడియో కాల్ ఏర్పాటు చేశారు. సినిమాలో ఆమె నటనను చూసిన ధనుష్ చిన్నారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ వీడియో కాల్‌లో ధనుష్ మాట్లాడిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నక్షత్ర నటనను ప్రశంసిస్తూ, ఎప్పుడైనా ఇద్దరం కలిసినప్పుడు 'నేను నీ దగ్గర నటన నేర్చుకోవాలి' అంటూ సరదాగా చెప్పారు.. ఒక స్టార్ హీరో, జాతీయ అవార్డు విజేత నుంచి ఇలాంటి ప్రశంసలు రావడంతో నక్షత్ర ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.ధనుష్‌తో జరిగిన ఈ ప్రత్యేక సంభాషణను బేబీ నక్షత్ర తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. దీంతో ఈ వీడియో నెటిజన్ల దృష్టిని ఆకర్షించి వైరల్‌గా మారింది.



## నేడు విడుదలవుతున్న టాక్సిక్

### - టిక్కెట్ రేట్ల పెంపునకు తెలంగాణలో అనుమతి

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్' ఆగస్టు 26 ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న తరుణంలో, తెలంగాణ ప్రభుత్వం సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు హోమ్ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సింగిల్ స్క్రీన్ థియేటర్లలో జీఎస్టీతో కలుపుకుని రూ. 50, అలాగే మల్టీప్లెక్స్‌లు మరియు స్పెషల్ థియేటర్లలో రూ. 100 వరకు అదనంగా టికెట్ ధరలను పెంచుకోవడానికి అనుమతిని ఇచ్చారు. పెంచిన ధరలు సినిమా విడుదలైన రోజు నుంచి సెప్టెంబర్ 4 వరకు పది రోజుల పాటు అమలులో ఉంటాయి. అలాగే ఈ పది రోజుల పాటు రోజుకు అదనంగా ఒక షోతో కలుపుకుని మొత్తం 5 షోలు ప్రదర్శించుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ధరల పెంపుతో పాటు మరికొన్ని కీలక నిబంధనలను కూడా ఖరారు చేసింది. సినీ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అకౌంట్‌కు నిర్మాణ సంస్థ 'కేవీఎన్-మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ ఎల్ఎల్‌పీ' తక్షణమే రూ. 1 కోటి విరాళంగా అందించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిధులను పూర్తిగా సినీ కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయనున్నారు. అలాగే, సినిమా ప్రదర్శన సమయంలో మాదకద్రవ్యాలు, నార్కోటిక్స్ మరియు సైబర్ క్రైమ్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించే ప్రత్యేక ప్రకటనలను తప్పనిసరిగా ప్రదర్శించాలని థియేటర్ల యాజమాన్యాలను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిబంధనలన్నీ ఎలాంటి లోపాలు లేకుండా కచ్చితంగా అమలయ్యేలా పర్యవేక్షించే బాధ్యతను జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు మరియు సినిమా లైసెన్సింగ్ అధికారులకు అప్పగించారు.

